కుసుమ జయభేరి e- మాస పత్రిక

# ధరిద్దాం ధైర్యపు చొక్కాను

అంటే అన్నానంటారు గానీ
సంసార మేనాను నాన్నతో పాటుగా
ఓ బోయిగా మోస్తుంది అమ్మ కాక మరెవరు...?

నిజంగా చెప్పాలంటే...
సమస్యల ముళ్ళకంపలో చిక్కి
గీరుకుపోయిన ఒంటికి
చల్లని మాటల మందును పూస్తూ
నాన్నకు ధైర్యపు చొక్కాని తొడిగింది అమ్మే...

దండం మీద ఆరేసిన అమ్మ చీర
ఇంటి గుట్టును కూడా అలా దాచేసింది గుట్టుగా...

ఎప్పటికప్పుడు ఆత్మవిశ్వాసపు పసరును నూరి
నాన్న అధైర్యపు పుండుకు పూస్తుంటుంది అమ్మ...

సమస్యల చీకట్లు పారద్రోలి
పరిష్కారపు కిరణాలను ప్రసరింపజేస్తూ
నాన్న వదనం మెరిసి పోయేలా చేసేది అమ్మ...



అడగడుగునా వెనకడుగు వేయనీయకుండా
నీడలా వెంటుండి నీ వెంటనే ఉంటానన్న మాట
భగవద్గీతలా వల్లిస్తూనే ఉంటుంది అమ్మ...

పిరికి తనపు మురికి అంటుకున్న
నాన్న బట్టలను ఆత్మస్థైర్యంతో శుభ్రం చేస్తూ
ధైర్యపు చొక్కాను ధరింపజేసి
నిలబెట్టింది ఓ మగమహారాజులా...

ఎవరమైనా సమస్యల వలయం నుండి
బయటపడడానికి
ధరిద్దామా... ధైర్యపు చొక్కాను....

**రమాదేవి బుక్కపట్నం**